

ప్రేమను పంచుదాం..
పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పాత్ర కీలకం. ప్రేమగా చూసుకుంటూ క్రమశిక్షణగా పెంచడమూ ముఖ్యమే. - 8లో



అతివేగమా.. నిద్రమత్తా!
ఖైతాపురం జంక్షన్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పోలీస్ అధికారులు దుర్మరణం చెందారు. - 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	581.30 అడుగులు
ఇన్‌ఫ్లో	:	1,20,339 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	36,033 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	29,435 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	511 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	4,287 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

అత్యవసర పనులకు రూ.కోటి నిధులు

నల్లగొండ: తుపాన్ కారణంగా అత్యవసర పనుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రూ.కోటి ఎస్‌డీఎఫ్ నిధులు విడుదల చేసింది. ఈ నిధులను డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డిపార్ట్ మెంట్ విభాగానికి కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

29న ఎంజీయూకు విద్యా కమిషన్ చైర్మన్ రాక

నల్లగొండ టూటౌన్ : నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీకి ఈనెల 29న రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పీఎల్.విశ్వేశ్వర్ రావు, డాక్టర్ చారకొండ వెంకటేష్, కె.జ్యోత్స్న శివారెడ్డి హాజరు కానున్నట్లు ఎంజీయూ రిజిస్ట్రార్ అలువాల రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 29న ఉదయం 10.30 గంటలకు సెమినార్ హాల్‌లో యూనివర్సిటీ భాగస్వామ్యంతో విద్యా శాఖపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. విద్యా సంబంధిత అంశాల చర్చ ద్వారా నాణ్యమైన విద్యను అందించే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషన్ బృందం.. యూనివర్సిటీ అధ్యాపకులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, విద్యార్థి సంఘాల నాయకులు, అఫ్లియేటెడ్ కళాశాలల యాజమాన్యాలు, టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలతో సమావేశం కానున్నట్లు తెలిపారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తులు

నల్లగొండ: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రధానాచార్యులు వారి కళాశాలల్లోని ఎస్సీ విద్యార్థుల చేత 2025–26 సంవత్సరానికి సంబంధించి ఉపకార వేతనాల మంజూరుకు దరఖాస్తులు చేయించాలని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకురాలు బి.శశికళ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్ వెబ్‌సైట్ telangana epass. cgg.gov.inలో సెప్టెంబర్ 30లోగా చేయాలని కోరారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న పుట్ల శ్రీనివాస్

చింతపల్లి : గ్రామీణ ప్రాంతాల ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్ సూచించారు. శనివారం చింతపల్లి మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వర నగర్ పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గ్రామాల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలను అందించాలని వైద్యసిబ్బందికి సూచించారు. సమయపాలన పాటించి విధులకు హాజరు కావాలని లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట వైద్యాధికారి వంశీకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

9.7 మి.మీ వర్షపాతం

నల్లగొండ అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు 9.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా దామరచర్ల మండలంలో 23.0 మిల్లీమీటర్లు, అత్యల్పంగా నేరడుగొమ్ము మండలంలో 2.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అలాగే కొండమల్లేపల్లి మండలంలో 18.8, పీఏపల్లి 17.5, పెద్దవూర 16.1, నిడమనూరు 15.8, దేవరకొండ 15.3, త్రిపురారం 13.2, తిరుమలగిరిసాగర్ 13.0, చండూరు 12.7, అనుముల హాలియాలో 11.4, చింతపల్లి 11.2, మునుగోడు 11.1, తిప్పర్తి 10.6, అడవిదేవులపల్లి 10.5, గుర్రంపోడు 9.0, నాంపల్లి 8.7, నల్లగొండ 8.7, చిట్యాల 8.4, శాలిగౌరారంలో 7.8, గట్టుప్పల్ 7.3, నకిరేకల్ 7.0, కేతేపల్లి 6.2, కనగల్ 6.1, కట్టంగూర్‌లో 5.9, గుండ్లపల్లి 5.8, మాడ్గులపల్లి 5.6, మర్రిగూడ 5.4, నార్కట్‌పల్లిలో 4.4, వేములపల్లి 4.1, చందంపేట 3.9, గుడిపల్లి 3.3, మిర్యాలగూడ 3.2, మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

పెద్దతండా పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

డిండి: మండలంలోని పెద్దతండా గ్రామ పంచాయతీ కార్యదర్శి తాహెరొద్దీన్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల అతడిపై సస్పెన్షన్ వేటు పడింది. సస్పెన్షన్ కాలం ముగిసేంత వరకు ఎంపీడీఓ కార్యాలయంలో విధులు నిర్వహించాలని కలెక్టర్ ఉత్వర్వుల్లో పేర్కొన్నట్టు కార్యాలయ వర్గాలు తెలిపాయి.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామ పంచాయతీ కార్యదర్శులు

బిల్లులు చెల్లించాలి

నల్లగొండ : పంచాయతీ కార్యదర్శులపై పనిభారం తగ్గించడంతోపాటు గ్రామాల్లో సొంత ఖర్చులతో చేసిన అభివృద్ధి పనులకు వెంటనే బిల్లులు చెల్లించాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శనివారం కలెక్టరేట్ ఎదుట కమిటీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు ఆందోళన చేపట్టారు. ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి సంబంధం లేకున్నా సస్పెండ్ చేసిన డిండి మండలం పెద్దతండా గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎండి.తాహెరొద్దీన్‌ను విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యదర్శులను కించపరిచి మాట్లాడే అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్‌లో అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏటీసీ కోర్సులపై ఆసక్తి

ఉపాధి శిక్షణ వైపు మళ్లుతున్న యువత

- నిరుద్యోగ నిర్మూలనే లక్ష్యంగా 4 ఏటీసీ సెంటర్లు ఏర్పాటు
- ఒక్కో సెంటర్‌లో 172 చొప్పున 688 సీట్లు
- ఇప్పటి వరకు వంద సీట్లు భర్తీ
- నెలాఖరు వరకు దరఖాస్తుల గడువు





డిండిలోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్, శిక్షణలో భాగంగా అందుబాటులో ఉంచిన ఆటోలు

డిండి: రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య లేకుండా చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నూతనంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లను తీసుకొచ్చింది. దీనిద్వారా ఏదో ఒక కోర్సు పూర్తికాగానే స్వయం ఉపాధి పొందవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. దీంట్లో భాగంగా ఈ విద్యాసంవత్సరానికి గాను మొదటగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐ, బాలికల ఐటీఐ, డిండి ఐటీఐ, అనుముల ఐటీఐలలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం నాలుగు ఏటీసీలను ప్రారంభించారు. అయితే కొత్తగా ఏర్పాటు చేసిన ఏటీసీలపై యువత చూపు మళ్లింది. ఏటీసీ కోర్సుల్లో చేరి స్వయం ఉపాధి పొందాలని యువత అటువైపుగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే కొందరు విద్యార్థులు ఏటీసీల్లోని వివిధ కోర్సుల్లో చేరి శిక్షణ పొందుతున్నారు.

సెంటర్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

యువతకు శిక్షణ నైపుణ్యాలను మెరుగుపరిచి ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు కోసం ఏర్పాటు చేసిన ఏటీసీల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. వివిధ కోర్సుల్లో శిక్షణ పొందే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతుల ఏర్పాటు చేయాలన్న ఆదేశాలు కూడా జారీ అయ్యాయి. దీంతో ఇటీవల డిండి మండల కేంద్రంలోని ఏటీసీని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించి కోర్సులు, అడ్మిషన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ శిక్షణ పొందే బాలురు, బాలికలకు వేర్వేరుగా హాస్టల్ భవనాల నిర్మాణాలకు ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని చూడాలని అధికారులను ఆదేశించారు.



రోబోటిక్స్ గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు

అవగాహన కల్పిస్తున్నాం



అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో శిక్షణ పొందడానికి పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న, పూర్తయిన విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. అడ్మిషన్ల గడువు ముగిసే సరికి ఏటీసీలో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది.

– వి.రాధాకృష్ణ ప్రిన్సిపాల్, ఏటీసీ డిండి

ఉపాధి పొందుతాం



ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌లో శిక్షణ అనంతరం ఉపాధి పొందడానికే ఇక్కడ చేరాను దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు వసతిగృహం సౌకర్యం ఏర్పాటు చేయాలి.

– ఆర్.అంజనేయులు ఏటీసీ విద్యార్థి

సంతోషంగా ఉంది



యువత ఉపాధి ద్వారా స్వయం శక్తితో ఎదగాలని ప్రభుత్వం అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. ఈ సెంటర్లపై పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుంది.

– ఎస్.అంజలి విద్యార్థిని

సీట్లు ఇలా..

జిల్లాలో ఏర్పాటు చేసిన ఒక్కొక్క ఏటీసీ సెంటర్‌లో మొత్తం కోర్సులకు సంబంధించి 172 సీట్లు కేటాయించారు. నాలుగు ఏటీసీలలో మొత్తం 688 సీట్లు ఉన్నాయి. వీటిని ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 100 సీట్ల వరకే భర్తీ అయినట్లు సమాచారం. ఏటీసీ కోర్సులపై యువత, విద్యార్థులకు అవగాహన కల్పిస్తే పెద్ద సంఖ్యలో చేరతారని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

కోర్సులు ఏమిటంటే..

పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెసినింగ్ టెక్నీషియన్ కోర్సుకు రెండేళ్ల కాలపరిమితితో 24 సీట్లు కేటాయించారు. అలాగే ఆర్టిషియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్ (ఏడాది కాలపరిమితి 20 సీట్లు), బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్ మెకానికల్ (రెండేళ్లు 24 సీట్లు), ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్ (రెండేళ్లు 40 సీట్లు), మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్ (రెండేళ్లు 24 సీట్లు), మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్, ఆటో మేషన్ (ఏడాది కాలపరిమితితో 40 సీట్లు) అందుబాటులో ఉన్నాయి.

దరఖాస్తు ఎలా చేసుకోవాలి..

ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో నూతనంగా ఏర్పాటు చేసిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో ఇప్పటి వరకే ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇందుకుగాను టెన్త్ మెమో, కుల ధ్రువీకరణ పత్రం, నాలుగో తరగతి నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్స్, ఈ మెయిల్ ఐడీ ద్వారా iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. దరఖాస్తు ప్రక్రియ గడువు ముగిసినంతరం పదో తరగతి మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా అర్హత కలిగిన విద్యార్థులకు ఆయా కోర్సుల్లో సీట్లు కేటాయించబడతాయి. ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.



మాజీ సైనికులను సన్మానిస్తున్న సిందూర్ ఫౌండేషన్ ప్రతినిధులు, మాజీ సైనిక సంక్షేమ సంఘం సభ్యులు

వీరజవాన్ కుటుంబాలకు అండగా ఉండాలి



కార్గిల్ వీరులకు నివాళులర్పిస్తున్న సిందూర్ ఫౌండేషన్ ప్రతినిధులు, మాజీ సైనికులు

నల్లగొండ: దేశ సేవలో ప్రాణాలర్పించిన వీర జవాన్ల కుటుంబాలకు అండగా ఉండాలని మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నంది పాపిరెడ్డి, కోశాధికారి భాస్కర్‌రెడ్డి కోరారు. శనివారం నల్లగొండలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో గల సైనిక సంక్షేమ సంఘం భవనంలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో మృతి చెందిన అమర జవాన్ల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. యోగా సిందూర్ ఫౌండేషన్ సహకారంతో వీరమరణం పొందిన జవాన్ల కుటుంబాలకు రూ.పదివేల చొప్పున చెక్కులు అందజేశారు. అనంతరం వీర జవాన్లు లాన్స్ నాయక్ గోపయ్యాచారి, మిట్ట శ్రీనివాస్‌రెడ్డి, షేక్ ఇమామ్ కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందదర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సైనికులకు క్యాంటిన్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో యోగా సిందూర్ ఫౌండర్ యోగా నారాయణ, ఫౌండేషన్ ప్రెసిడెంట్ శివ దుర్గాప్రసాద్, ఏడీఈ కట్కూరి శ్రీనివాస్‌రెడ్డి, రామారావు, యోగా గురువు చంద్రశేఖర్, డాక్టర్ ప్రజా స్వాతి, డాక్టర్ చంద్రశేఖర్, సైనికుల సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి కొల్లోజు వెంకటాచారి, జి సత్యనారాయణరెడ్డి, చంద్రయ్య, రాములు, లింగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కేశవులు, రామ చంద్రయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్య సాధనకు శ్రమించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్



బోర్డుపై రాసి వివరిస్తున్న కలెక్టర్, విద్యార్థులతో కలిసి వింటున్న ఎస్పీ

నార్కట్‌పల్లి : విద్యార్థి దశ నుంచే ఒక లక్ష్యాన్ని పెట్టుకుని దాని సాధనకు నిరంతరం శ్రమించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. నార్కట్‌పల్లిలో కొనసాగుతున్న మూసీ మహాత్మా జ్యోతిరావు పూలే బాలురు రెసిడెన్షియల్ కళాశాలను శనివారం వారు సందర్శించారు. అనంతరం తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ భవిష్యత్ లక్ష్యాలతోపాటు పలు అంశాలపై బోర్డుపై రాసి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. కష్టపడి చదివితేనే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటామని పేర్కొన్నారు. చెడు అలవాట్లకు లోనుకావద్దన్నారు. ప్రతి విద్యార్థి మొబైల్ ఫోన్లు పక్కకు పెట్టి చదువు మీద దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా తమకు వేతనాలు పెంచాలని కళాశాలలో వంట, శానిటేషన్ పనిచేసే వర్కర్లు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఆర్డీఓ యానాల అశోక్ రెడ్డి, నార్కట్‌పల్లి తహసీల్దార్ వెంకటేశ్వరరావు, సీఐ నాగరాజు, ఆర్ఐ తరుణ్, ఎస్ఐ క్రాంతికుమార్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విద్యాసాగర్, శివశంకర్, రాజ్‌కుమార్, భార్గవి పాల్గొన్నారు.

ఎరువులను పక్కదారి పట్టిస్తే క్రిమినల్ కేసులు



ఎరువుల వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్, చిత్రంలో ఎస్పీ తదితరులు

చిట్యాల: రైతులకు సబ్సిడీపై అందించే యూరియాను పక్కదారి పట్టిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, ఎరువుల దుర్వినియోగంకు సహకరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. చిట్యాల పట్టణంలోని పీఏసీఎస్ ఎరువుల గోడౌన్‌ను, వెలిమినేడు గ్రామ శివారులో యాడ్ బ్లూ డీఈఎఫ్ఎల్ సేల్ కౌంటర్‌ను శనివారం ఆమె జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశ్రమల్లో వాడేందుకుగాను కేటాయించిన యూరియానే వారు వాడాలన్నారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ ఎరువుల విక్రయాలపై నిఘాకు జిల్లాలో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి పి.శ్రవణ్‌కుమార్, నల్లగొండ ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి, తహసీల్దార్ జి.కృష్ణనాయక్, ఏఓ గిరిబాబు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందికి వేతన ఇక్కట్లు



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న ఎఫ్ఏలు (ఫైల్)

- నాలుగు నెలలుగా అందని వేతనాలు
- జిల్లా వ్యాప్తంగా 670 మంది ఉద్యోగులు
- వెంటనే అందించాలని వేడుకోలు
- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన

చిట్యాల: ఉపాధిహామీ పథకంలో సేవలందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు (ఎఫ్ఏలు), టెక్నికల్ అసిస్టెంట్లు (టీఏలు), అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్లు (ఏపీఓలు), కంప్యూటర్ ఆపరేటర్లు, ఈసీలకు నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదు. దీంతో సిబ్బంది కుటుంబాలు గడవక ఇబ్బందులు పడుతున్నారు. వీరిలో ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు నెలకు రూ.12,500, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీఓలకు వారి సర్వీస్‌ను బట్టి రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకు వేతనాలు ఇస్తున్నారు. ఇవి కూడా నెలనెలా సక్రమంగా అందకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నామని సిబ్బంది వాపోతున్నారు. తాము అదనంగా ఇతర గ్రామాల్లో బాధ్యతలు కూడా చూడాల్సి వస్తుందని చెబుతున్నారు. పథకం అమలులో కూలీల నుంచి దరఖాస్తులు స్వీకరించడం మొదలు క్షేత్రస్థాయిలో కొలతలు తీయడం వరకు కీలక పాత్ర పోషిస్తున్నామని అయినా తమపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని సిబ్బంది అంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా సిబ్బంది ఇలా..

జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో 461 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, 146 టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీఓలు 30 మంది, మండలానికి ఒక ఈసీ ఉన్నారు. వీరికి ఇప్పటి వరకు మూడు నెలలు వేతనాలు పెండింగ్‌లో ఉండగా జూలై నెల వేతనంతో కలిపి నాలుగు నెలలవి అందాల్సి ఉంది. జిల్లాలో ఎంపీడీఓలకు వినతి పత్రాలు అందజేస్తున్నా తమ గోడు ఎవరూ పట్టించుకోవడం లేదని ఉపాధి ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వేతనాలివ్వాలని ఉపాధి సిబ్బంది కోరుతున్నారు.

వేతనాలు అందించాలి



నాలుగు నెలలుగా ఉపాధి ఉద్యోగులకు వేతనాలు అందడం లేదు. దీంతో మాకు రోజువారి జీవనం కష్టంగా మారింది. వేతనాలివ్వాలని అధికారులకు వినతి పత్రాలు అందజేస్తున్నా స్పందన లేదు. వెంటనే వేతనాలు అందించి మా కుటుంబాలను ఆదుకోవాలి.


– మర్రి రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ల అసోసియేషన్ జిల్లా మాజీ అధ్యక్షుడు

టెక్నికల్ ఇబ్బందులతో ఆగాయి

కేంద్ర ప్రభుత్వం ద్వారా వేతనాల చెల్లిస్తుండడంతో టెక్నికల్ ఇబ్బందులతోనే ఉపాధి ఉద్యోగులకు వేతనాలు ఆగాయి. స్పర్శ సాఫ్ట్‌వేర్ ద్వారా పారదర్శకంగా పే స్కేల్ వర్తింపజేసి చెల్లింపులు జరుపుతాం. మరో ఒకటి, రెండు రోజుల్లో వేతనాలు అందనున్నాయి.

– శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీఓ, నల్లగొండ

మూసీ నీటి విడుదల కొనసాగింపు



గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

- రెండో రోజూ రెండు గేట్ల ద్వారా 1,736 క్యూసెక్కులు

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో అధికారులు శుక్రవారం ఎత్తిన రెండు క్రస్టు గేట్ల ద్వారానే శనివారం కూడా నీటిని వదులుతున్నారు. సాయంత్రం వరకు మూసీకి ఎగువ ప్రాంతాల నుంచి 1,736 క్యూసెక్కుల నీరు వస్తుండగా అధికారులు ప్రాజెక్టు రెండు క్రస్టు గేట్లను ఒక అడుగు మేర పైకెత్తి 1,184 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులో గరిష్ట నీటిమట్టం 645 అడుగులు కాగా 643.50 మేర నిల్వ ఉంది. ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఆయకట్టు భూములకు 479 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. సీపేజీ, లీకేజీ, ఆవిరి రూపంలో 72 క్యూసెక్కుల నీరు వృథా అవుతుంది. గేట్ల ద్వారా, కాల్వలకు కలిపి మొత్తం 1,736 క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది. మూసీ రిర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.07 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు ఏఈ మధు తెలిపారు.

'ఆరోగ్యశ్రీ'తో వైద్య సేవలన్నీ ఉచితమే..

- ఆరోగ్యశ్రీ జనరల్ మేనేజర్ డాక్టర్ రాంబాబు

మిర్యాలగూడ అర్బన్: ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందిస్తున్న వైద్యసేవలన్నీ ఉచితమేనని అర్హులైన పేదలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్య శ్రీ ట్రస్ట్ రాష్ట్ర జనరల్ మేనేజర్ డాక్టర్ రాంబాబు అన్నారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలోని జ్యోతి, రివర్ ఆస్పత్రులను ఆయన తనిఖీ చేశారు. పలు వివరాలపై ఆరా తీశారు. రోగ్య శ్రీలో వైద్య సేవలు పొందుతున్న రోగుల వార్డులను పరిశీలించి వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య సేవలన్నీ ఉచితంగా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ శివప్రసాద్, డీవైఈఓ శ్రీనివాస్, డీఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ఆస్పత్రి వద్ద సిబ్బందితో ఆరోగ్య శ్రీ ట్రస్ట్ సభ్యులు

క్లుప్తంగా

సూక్ష్మకళాకారుడికి జాతీయ స్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న సైదులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణానికి చెందిన సూక్ష్మకళాకారుడు, ఇండియా బుక్ ఆఫ్ రికార్డు గ్రహీత తమలపాకుల సైదులు నార్త్ ఢిల్లీ కల్చరల్ అకాడమీ నేషనల్ అవార్డు అందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన త్యాగరాయగాన సభలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, రిటైర్డ్ న్యాయమూర్తి మధుసూదన్‌లు అవార్డు అందజేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

మునగాల: మునగాల మండలం కోదండ రామాపురం గ్రామంలోని ఓ ఇంటిలో శనివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామానికి చెందిన దార్ల లాలయ్య ఇంటిలో షార్ట్‌సర్క్యూట్ అయింది. దీంతో రూ.10వేల నగదుతో పాటు పలు గృహోపకరణాలు కాలిపోయాయి. వీటి విలువ రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాప్రాయం కలగలేదు.

అదుపుతప్పి బొగ్గులోడు లారీ బోల్తా

అర్వపల్లి: నకిరేకల్– తానంచర్ల జాతీయ రహదారిపై బొల్లంపల్లి సమీపంలో శనివారం లారీ బోల్తా పడింది. తుంగతుర్తి వైపు నుంచి అర్వపల్లి వైపు బొగ్గు లోడ్‌తో వస్తున్న లారీ బొల్లంపల్లి సమీపంలో అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న వారు తృటిలో తప్పించుకున్నారు.



ఆరేళ్ల వయసులో తల్లిదండ్రులతో కలెక్టర్ ఇలా త్రిపాఠి (ఫైల్)

నాన్న నాతో ఫ్రెండ్లీగా ఉండేవారు

• కలెక్టర్ ఇలా త్రిపాఠి, నల్లగొండ



మా నాన్న నాతో ఫ్రెండ్లీగా ఉండేవారు. జీవితంలో ఎలాంటి సంఘర్షణలు ఎదురైనా కొట్లాడాలని, పోరాడాలని చెప్పేవారు. మా ఇంట్లో నేను మా అక్క ఉండేవారం. చిన్ననాటి నుంచే ఇంట్లో క్రమశిక్షణ నేర్పారు. చదువు మీద ఫోకస్ చేయాలని చెప్పేవారు. ఎప్పుడు అమ్మా నాన్న మా పట్ల కఠినంగా వ్యవహరించలేదు. అంతా క్రమశిక్షణతో ఉండేవాళ్లం. ప్రతి విషయాన్ని నాన్నతో చెప్పేవాళ్లం. తప్పు చేసినా, ఎలాంటి ఆలోచన వచ్చినా దాన్ని నాన్నతో పంచుకునే వాళ్లం. చిన్న నాటి నుంచి నాన్న ఎప్పుడు ఏడవద్దు... ప్రతిదాని పట్ల పోరాట తత్వం ఉండాలని చెప్పేవారు. ఇంట్లో భయంతో ఉంటే బయటకు వెళ్తే ధైర్యంగా ఉండరు. కాబట్టి చిన్న నాటి నుంచే నాన్న ఆ విధంగా పెంచారు. ఇంజనీరింగ్ చదివేప్పుడే యూపీఎస్సీ వైపు ప్రోత్సహించారు. వారు క్రమశిక్షణతో పెంచారు కాబట్టే నేను ఈ స్థాయికి రాగలిగాను.

ప్రేమను పంచుదాం.. క్రమశిక్షణ నేర్పుదాం

- పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకం
- పిల్లలు చెడు దృష్టి వైపు మరలకుండా చూడడం తప్పనిసరి
- శ్రద్ధ వహించకపోతే అనర్థాలే అంటున్న మానసిక వైద్యులు
- నేడు నేషనల్ పేరెంట్స్ డే



సండే స్పెషల్

నల్లగొండ : పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పాత్ర కీలకం. పిల్లలను ప్రేమగా చూసుకోవడంతో పాటు క్రమశిక్షణగా పెంచడం కూడా ముఖ్యమే. పిల్లల శారీరక మానసిక సామాజిక భావోద్వేగ అభివృద్ధికి తల్లిదండ్రులు మార్గదర్శకులుగా ఉండాలి. పిల్లలకు అన్ని సౌకర్యాలు కల్పించడం కాదు వాళ్లకి కావాల్సిందేమిటి, మనం ఇస్తుందేమిటీ అన్న ఆలోచన తల్లిదండ్రుల్లో ఉండాలి. పిల్లల్లో శారీరక, మానసిక మార్పులు జరిగే వయసులో వారిని పెంచడం తల్లిదండ్రులకు చాలెంజింగ్ మారుతుంది. టీనేజర్ పెంపకం కంటే అప్పుడే పుట్టిన శిశువును పెంచడం చాలా తేలికని చాలా మంది సైకియాట్రిస్టుల అభిప్రాయం. హార్మోన్ల వల్ల వాళ్ల మూడ్, ఆటిట్యూడ్, విభిన్నమైన ప్రవర్తనలో మార్పులు వస్తాయి. ఈ హార్మోనల్ మార్పు 13 నుంచి 18 ఏళ్లలోపు జరుగుతుంది. ఇలాంటి సమయంలో వాళ్లకు సరైన సలహా, గైడెన్స్, అటెన్షన్ ఇవ్వడం చాలా అవసరం. టీనేజ్ పిల్లల పట్ల తల్లిదండ్రులు ఎలా మెలగాలో మానసిక వైద్యులు పలు సూచనలు చేశారు.

■ ఎక్కువగా నియంత్రించడం మంచిది కాదు

టీనేజర్స్‌ని మరీ ఎక్కువగా నియంత్రణ చేయడం అంత మంచిది కాదు. కొన్ని విషయాల్లో వారే సొంత నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ ఇవ్వాలి. మరీ ఎక్కువగా కంట్రోల్ చేయడం వల్ల తప్పుగా నిర్ణయాలు తీసుకునే ప్రమాదం ఉంది. ముఖ్యంగా టీనేజీలో పిల్లలు శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందుతారు. కొన్ని విషయాలపై శ్రద్ధ పెట్టడం ముఖ్యం.

■ పిల్లలతో ఓపెన్‌గా ఉండాలి

పిల్లలతో కొన్ని విషయాల్లో ఓపెన్‌గా ఉండాలి. సరైన సలహాలు ఇవ్వాలి. ఉదాహరణకు స్మోకింగ్, డ్రగ్స్, ఆల్కాహాల్ వంటి వాటివల్ల కలిగే హాని గురించి వారికి వివరించాలి.

■ పరిశీలన అవసరం

ప్రతి చిన్న విషయాన్నీ మానిటర్ చేయొద్దు. తెలుసుకోవాలని ఉంటే నేరుగా పిల్లలను అడగాలి. పిల్లల విషయాల గురించి మాట్లాడటానికి సంకోచించొద్దు.

■ కొత్త స్నేహాలు మంచిది కాదని భావించొద్దు

కొత్త స్నేహాలు మంచిది కాదని భావించొద్దు. కొత్తవాళ్లతో పరిచయం అలవాటవ్వాలి. అంతే కాకుండా తన ఫ్రెండ్స్‌ని ఇంటికి తీసుకురమ్మని చెప్పండి. దీనివల్ల స్నేహితులు ఎలాంటి వాళ్లో తెలుస్తుంది.

■ తల్లిదండ్రులు పిల్లలతో కొద్దిసేపైనా కాలక్షేపం చేయాలి

కుటుంబ సభ్యులతో కలిసి టూర్లకు వెళ్తుండాలి. సినిమాలు కలిసి చూడటం, డిన్నర్ ప్లాన్ చేయడం వంటివి తరచుగా చేస్తుండాలి. పిల్లలకు కుటుంబంతో బంధం బలపడటానికి ఇలాంటి సంఘటనలు దోహదపడతాయి.

మా అమ్మానాన్న నాకు ఏదీ వద్దని చెప్పలేదు

• ఎస్పీ శరత్ చంద్రపవార్, నల్లగొండ



తల్లిదండ్రులతో నల్లగొండ ఎస్పీ శరత్ చంద్రపవార్

నా చిన్నప్పటి నుంచి మా అమ్మానాన్న నాకు ఏదీ వద్దని చెప్పలేదు. నాకు క్రికెట్ అంటే ఇష్టం. అందులో ప్రోత్సహించారు. కానీ ఏది చేస్తానన్న వద్దని చెప్పలేదు. చదువు మాత్రం ముఖ్యమని చెప్పారు. ఏది చదవాలనే దానిపై నేనే ముందుకు వెళ్లేలా మా అమ్మానాన్నలు ప్రోత్సహించారు. జీవితంలో పిల్లలకు చదువుతో పాటు ఆటలు ముఖ్యం. తల్లిదండ్రులు ఈ విషయంలో దృష్టి సారించాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలను గమనించాలి. పొరపాటు చేస్తే అది కాదు ఇలా అని చెప్పాలి. ప్రస్తుతం పిల్లలకు ఆరోగ్యం ముఖ్యం. దానిపై కూడా జాగ్రత్త వహించాలి. తల్లిదండ్రులు చదువే ముఖ్యమనుకోవద్దు. ఆటలు కూడా ప్రోత్సహించాలి. ప్రస్తుతం చాలా మంది పిల్లలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఆటలను ప్రోత్సహించడం వల్ల పిల్లల్లో ఓటమిని కూడా అంగీకరించే ధైర్యం వారిలో వస్తుంది. నాకు నాలుగు సంవత్సరాల బాబు ఉన్నాడు. కరాటే శిక్షణకు పంపుతున్నా. రెండు సంవత్సరాల పాప ఉంది. ఆమెకు కూడా కరాటే నేర్పుతాను.

పిల్లలకు మార్గదర్శకులుగా ఉండాలి



ప్రస్తుత కాలంలో ఉద్యోగ బాధ్యతలో బిజీగా ఉండే తల్లిదండ్రులు పిల్లల పట్ల పెద్దగా శ్రద్ధ వహించలేకపోతున్నారు. మంచి, చెడులు చెప్పే వృద్ధులు కూడా వారికి లేకుండా పోయారు. పిల్లల పెంపకంలో తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయుల పాత్ర కూడా ఉంటుంది. ఇంట్లో తల్లిదండ్రులు, పాఠశాలలో ఉపాధ్యాయులదే బాధ్యత. ప్రస్తుత పరిస్థితుల్లో పరిమితంగా ఒక్కరూ లేదా ఇద్దరు పిల్లలు ఉండడం వల్ల అతి ప్రేమతో గారాబం వల్ల ఏది చేసినా వదిలేస్తున్నారు. దీంతో పిల్లవాడు తాను చేసే పని సరైందనే భావన కలుగుతుంది. పిల్లవాడు తప్పు చేస్తే ఖండించాలి మంచి చేస్తే మెచ్చుకోవాలి. పిల్లలు చెడు దృష్టి వైపు మరలకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. పిల్లలకు మార్గదర్శకులుగా ఉండాలి.

– డాక్టర్ సుబ్బారావు, మానసిక వైద్య నిపుణుడు

ఆరేళ్లలో వంద బైక్‌లు చోరీ

ఆలేరు: గత ఆరేళ్లలో సుమారు వంద బైక్‌ల చోరీకి పాల్పడిన వ్యక్తి శనివారం ఆలేరులో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డాడు. కేసు వివరాలను ఆలేరు పోలీస్‌స్టేషన్‌లో సీఐ కొండల్‌రావు వెల్లడించారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన కంప విజయ్(23) చిన్నతనంలోనే అతడి తల్లి మృతి చెందింది. తండ్రి మరో మహిళను పెళ్లిచేసుకున్నాడు. తల్లి బంధువుల వద్ద పెరిగిన విజయ్ వరంగల్‌లో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో కుకింగ్ పనిచేశాడు. విలాసవంతంగా జీవించాలనే ఆలోచనతో నేరాల బాట పట్టాడు. ఇందుకు సులువుగా డబ్బులు సంపాదించేందుకు చోరీలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈక్రమంలో 2019లో ఇంతేజార్‌గంజ్ ఠాణా పరిధిలోని ఓ గుడిలో చోరీకి పాల్పడి జైలు పాలయ్యాడు. జైలు నుంచి విడుదలైన తరువాత బైక్ చోరీలు చేయడం మొదలుపెట్టాడు. ఇలా వరంగల్, మట్వాడ ఠాణాల పరిధిలో బైక్‌లు అపహరించాడు. వాటిని రూ.20–30వేలకు విక్రయించి, వచ్చిన డబ్బులతో జల్సాలు చేశాడు. ఓ దోపిడీ కేసులోనూ విజయ్‌పై మట్వాడ పోలీసులు పీడీ యాక్టు ప్రయోగించారు. ఒక ఏడాదిపాటు జైలులో ఉన్నాడు. విడుదలైన తర్వాత 2022 నుంచి 2023 వరకు ఎనుమాముల, ఇంతేజార్‌గంజ్, మిల్స్ కాలనీ, హనుమకొండ, ఆత్మకూర్‌ల పరిధిలో 54 బైక్‌ల చోరీకి పాల్పడ్డాడు. ఎనుమాముల పోలీసులు 2023లో అరెస్టు చేసి, జైలు పంపించారు. ఈ ఏడాది జూన్ 17న విడుదలైన విజయ్ గత 15రోజుల వ్యవధిలో ఆలేరు, జనగాం, భువనగిరి పట్టణాల్లో మూడు బైక్‌లను అపహరించాడు.

పెంబర్తి నుంచి ఆలేరు వైపు వస్తుండగా..

ఆలేరు హైవేలో శనివారం ఉదయం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. పెంబర్తి నుంచి ఆలేరు వైపు బుల్లెట్, యాక్టీవా వాహనాలపై ఇద్దరు వ్యక్తులు వేర్వేరుగా వస్తున్నారు. ఈ రెండు వాహనాలకు నంబర్ ప్లేట్ లేకపోవడంతో పోలీసులు అనుమానంతో ఆపారు. వాహనాల పత్రాలు చూపించాలని ప్రశ్నించగా అసలు విషయం బయటపడింది. ఆలేరు, జనగాం, భువనగిరిలలో బైక్‌లు చోరీ చేసినట్లు నేరం అంగీకరించడంతో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. విజయ్‌కు సహకరించిన జనగామకు చెందిన మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకొని పూచీకత్తుపై పంపించారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు జనగాం సమీపంలోని చెట్ల పొదల్లో దాచిన మరో రెండు చోరీ బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కృషి చేసిన క్రైం కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, మహేష్‌లకు సీపీ ఆదేశాల మేరకు సీఐ రివార్డు అందజేశారు.

ప్రియుడి ఇంటి ఎదుట ధర్నా

కోదాడరూరల్ : తనతో సహజీవనం చేసి పెళ్లికి నిరాకరిస్తున్నాడని మహిళ శనివారం ప్రియుడి ఇంటి ఎదుట ధర్నాకు దిగింది. నడిగూడెం మండల రత్నవరం గ్రామానికి చెందిన అనూషకు ఏడేళ్ల కిందట అదే మండలంలోని చాకిరాలకు చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. ఆ తర్వాత అతడితో విడిపోయింది. ఈక్రమంలో కొమరబండకు చెందిన మహేష్‌తో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఇద్దరూ కలిసి కోదాడలో నివాసం ఉంటూ సహజీవనం చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు కూడా ఉన్నారు. ఇటీవల మహేష్ ఆమెను దూరం పెడుతూ మరో పెళ్లి చేసుకునేందుకు సిద్ధం అవుతున్నాడు. దీంతో సదరు మహిళ తనను పెళ్లి చేసుకోవాలని కొమరబండకు వెళ్లి ఆ యువకుడి ఇంటి ఎదుట ధర్నాకు దిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికు చేరుకుని స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలపడంతో తనకు న్యాయం జరిగే వరకు ఇక్కడే ఉంటానని ఇద్దరి పిల్లలతో కలిసి భీష్మించుకుని కూర్చుంది.

నీటి సంపులో పడి వ్యక్తి మృతి

వలిగొండ : ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన వలిగొండ మండలంలోని జాలుకాల్వ గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా కాకునూరు మండలం బోడిపాలెం గ్రామానికి చెందిన కనికొటి వీరేంద్రచౌదరి (27) జాలుకాల్వలోని దివీస్ ల్యాబొరేటరీకి చెందిన మాన్‌పవర్ వాటర్ సంపు వద్ద రెండు సంవత్సరాల నుంచి వాటర్‌మన్ గా విధులు నిర్వహిస్తున్నాడు. మోటార్‌పంప్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి సంపులో పడి మృతి చెందాడు. తోటి సిబ్బంది గమనించి అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకుని సంపులో నీటిని తోడి మృతదేహాన్ని శుక్రవారం రాత్రి బయటకు తీశారు. మృతుడి తండ్రి శ్రీనివాస్‌రావు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై యుగంధర్ తెలిపారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

భువనగిరి, బీబీనగర్: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన శనివారం భువనగిరి మండల పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి–పగిడిపల్లి రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెంది ఉండడంతో సమాచారం అందుకున్న రైల్వేపోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని, రైలులో నుంచి ప్రమాదవశాత్తు జారి పడి ఉండవచ్చని భావిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపర్చినట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 98482 22169ను సంప్రదించాలని భువనగిరి రైల్వే పోలీస్ ఇన్‌చార్జ్ కృష్ణారావు తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

పెద్దవూర: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం పెద్దవూర మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హాలియాకు చెందిన నెర్మటి మధుసూదన్‌రెడ్డి (55) శనివారం తన సమీప బంధువుల ఫంక్షన్‌కు బైక్‌పై వెళ్లాడు. తిరిగివస్తుండగా హాలియా నుంచి పెద్దవూర వైపు వెళ్తున్న సిమెంట్ లోడ్ లారీ అతివేగంతో మధుసూదన్‌రెడ్డి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

- వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి అనితా రామచంద్రన్



సమావేశంలో మాట్లాడుతున్న అనితా రామచంద్రన్

భానుపురి (సూర్యాపేట) : వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మహిళ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ సెక్రటరీ, ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి అనిత రామచంద్రన్ పేర్కొన్నారు. శనివారం సూర్యాపేటలోని కలెక్టర్ ఛాంబర్‌లో ఖరీఫ్ సీజన్, సీజనల్ వ్యాధులు, వరదలపై తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై కలెక్టర్, అదనపు కలెక్టర్లతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి అనితా రామచంద్రన్ మాట్లాడుతూ.. శిథిలావస్థలో ఉన్న భవనాలు గుర్తించి వాటిని తొలగించాలని సూచించారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ.. వరదలపై కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. పులిచింతల వెనుక జలాల్లో ముంపు గ్రామాలకు పునరావాసం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా ఇరిగేషన్, వ్యవసాయ, పశుసంవర్ధక, వైద్యారోగ్య అధికారులు, సివిల్ సప్లయ్ అధికారులు తమ శాఖ పురోగతిని తదితర అంశాలను వివరించారు. సమావేశంలో పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, ఇరిగేషన్ డీఈలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్య, నాణ్యమైన పోషకాహారం అందించాలి

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య, నాణ్యమైన పోషకాహారం అందించాలని మహిళ, శిశు,వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ సెక్రటరీ అనితా రామచంద్రన్ పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో మహిళ శిశు దివ్యాంగులు వయోవృద్ధుల అధికారులతో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌తో కలిసి ప్రత్యేక అధికారి అనిత రామచంద్రన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ.. అంగన్‌వాడీల్లో పిల్లల హాజరు పెంచాలని, బాలింతలు, గర్భిణులు పోషకాహారం తీసుకునేలా ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలని తెలిపారు. పోషకాహారం తీసుకుంటనే కడుపులోని బిడ్డ ఆరోగ్యకరంగా పెరుగుతాయరని పేర్కొన్నారు. సమావేశంలో డీడబ్ల్యూఓ దయానందరాణి, డీసీపీఓ రవి, సీడీపీఓలు, సూపర్ వైజర్లు, సఖి, మహిళా సాధికారత కేంద్రం, పోషణ్ అభియాన్ అధికారులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో ఎలక్ట్రిక్ వాహన సేవలు ప్రారంభం



ఎలక్ట్రిక్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎయిమ్స్ డైరెక్టర్ శాంతాసింగ్

బీబీనగర్: బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలలో వైద్యులు, రోగుల అవసరాల రీత్యా ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వాహనాలను శనివారం ఎయిమ్స్ డైరెక్టర్ అహంతెం శాంతాసింగ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలక్ట్రికల్ వాహనాల ద్వారా ఎయిమ్స్ క్యాంపస్‌లోని అకాడమిక్, ఆస్పత్రి భవనాల మధ్యన రాకపోకలకు, రోగుల వైద్య సామగ్రి తరలింపు కోసం స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రెండు వాహనాలను సమకూర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎయిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ రాహుల్‌నారంగ్, డిప్యూటీ డైరెక్టర్ వర్గీస్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్మహత్య



అనిల్ (ఫైల్)

డిండి: కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యల కారణంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన డిండి మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా నాగారం మండల కేంద్రానికి చెందిన జె.అనిల్(53) డిండి పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉంది. వీరు సూర్యాపేటలో నివాసం ఉంటుండగా, అనిల్ ఒక్కడు డిండిలోని బస్టాండ్ సమీపంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. గత కొంత కాలంగా కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలు వేధిస్తున్నాయి. ఈనెల 22 నుంచి సెలవులో ఉన్న అనిల్ డిండిలోని అద్దె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టూ పక్కల వారు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

చోరీ కేసులో నలుగురు అరెస్టు

మిర్యాలగూడ అర్బన్: చోరీ చేసిన వాటర్ ట్యాంక్ వాల్వ్‌ను అమ్మేందుకు ఆటోలో తీసుకెళ్తుండగా నలుగురు నిందితులను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను వన్‌టౌన్ సీఐ మోతీరామ్ వెల్లడించారు. మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన కేదారి కోటేష్, కత్తుల సాయికుమార్, ఉబ్బపల్లి వేణు, ఈగల రాకేష్ ఈ నెల 23న రాత్రి పట్టణంలోని పాతమార్కెట్ యార్డ్‌లో ఉండే వాటర్‌ట్యాంక్ వాచ్‌రూంలో ఉన్న రూ.80వేలు విలువ చేసే పాత వాటర్ ట్యాంక్ వాల్వ్‌ను ఆటోలో తీసుకెళ్లి మార్కెట్ యార్డ్‌లో గల కంప చెట్లలో దాచి పెట్టారు. దానిని పాత ఇనుప సమాను షాపులో విక్రయించేందుకు శనివారం ఆటోలో తీసుకువెళ్తున్నారు. రాజీవ్‌చౌక్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు అనుమానం రావడంతో ఆటోను ఆపి వివరాలు అడిగారు. పొంతనలేని సమాధానం చెప్పడంతో అది చోరీ చేసిన వస్తువుగా గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేశారు. వారు నేరం అంగీకరించడంతో నలుగురిని అరెస్టు చేశారు. వాటర్ ట్యాంక్ వాల్వ్, ఆటోను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ సైదిరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సైదులు, కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, ప్రసాద్ పాల్గొన్నారు.